www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

5

కోనసీమ

గోదావరి పుష్కరాల తేదీలు ఖరారు

2027 జూన్ 26 నుంచి జులై 7 వరకూ నిర్వహణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. 2027 జూన్ 26 నుంచి జులై 7వరకూ పుష్కరాలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దీనికి సంబంధించి శుక్రవారం జిఒ ఆర్‌టి నెంబర్.1575ను విడుదల చేసింది. తిరుమల తిరుపతి ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణపూర్ణప్రసాద్ గోదావరి పుష్కరాలకు ఈ తేదీలను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నట్టు తెలిపింది.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలి
- మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి

ప్రజాశక్తి - అమలాపురం

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీ రాణి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బేబీ రాణి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చినప్పటికీ వారికి ఇంత వరకు పెరిగిన వేతనాలు ఇవ్వలేదన్నారు. మిగిలిన మినీ సెంటర్లను క్వాలిఫికేషన్ లేదనే పేరుతో మెయిన్ సెంటర్లగా అప్ గ్రేడ్ చేయలేదన్నారు. వీటిని వెంటనే మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు డిపార్ట్మెంట్ ఉద్యోగులకు మాదిరిగా డిఎ ఉండదన్నారు. డిఎ రాని స్కీం కార్మికులకు రెండేళ్లకు ఒకసారి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఐదేళ్ల దాటినప్పటికీ వేతనాలు పెంచకుండా గత ప్రభుత్వంలాగే ఈ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ ఉద్యోగులకు గ్రాట్యూటీతో పాటు జిఒకిు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గైడ్ లైన్స్ రూపొందించాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లలలో రాజకీయ జోక్యాన్ని నివారించి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులను కేటాయించడం వల్ల

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మాతమరణాలు, శిశు మరణాలు తగ్గించడం చాలా మందకొడిగా కొనసాగుతున్నదన్నారు. పోషకాహారం తగినంతగా అందక ఇంకా గణనీయమైన శాతంలో పిల్లలు ఎదుగుదల లోపంతో పాటు, తక్కువ బరువుతో ఉన్నారని అన్నారు. నిధుల కొరత వలన లబ్ధిదారుల లిస్టులు తగ్గించే ప్రయత్నాలను వ్యతిరేకించాలనీ నిధులను తగినంత స్థాయిలో పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ 2019 నుంచి వేతనాలు పెరగనందున అంగన్‌వాడీలు వేతన సమస్యల పరిష్కారం కోసం 2023 డిసెంబర్‌లో 42 రోజుల పాటు సమ్మె నిర్వహించినప్పుడు అప్పటి ప్రభుత్వం 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. అయితే ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ అప్పుడు ప్రతిపక్షంలో ఉండగా తాము 2024లో అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసిందన్నారు. కాని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ వేతనాలు పెంచేపని చేయలేదన్నారు. మినీవర్కర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించలేదనీ అన్నారు.

అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బేబీ రాణి

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల ప్రధాన డిమాండ్లు

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలు చేయాలని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చాలన్నారు. సెంటర్ నిర్వహణకు 5జి ఫోన్లు ఇవ్వాలన్నారు. ఎస్ఆర్ఎస్ రద్దు చేయాలనీ గ్రాట్యూటీ అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించి వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులు భర్తీచేయాలనీ, లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని అన్నారు. మెనూ చార్జీలు పెంచి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలలన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చేసి ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.నాగవరలక్ష్మి, ఎం.దుర్గమ్మ, రాణి, బేబీ, సుశీల, ఎ.వెంకటలక్ష్మి, ఎం.రత్నకుమారి, కె.విజయ, కె.సుజాత, ఆర్.రత్నకుమారి, జయలక్ష్మి, నూకరత్నం, ఎం.సూర్య కుమారి, ఎం.కమల, సిఐటియు నాయకులు భాస్కరరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - అమలాపురం

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో తొమ్మిది మంది దుర్మరణం పాలవడంపై సిపిఎం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. చిత్తూరు జిల్లా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు వస్తున్న ఒక ప్రయివేటు పర్యాటక బస్సు నియంత్రణకోల్పోయి లోయలో పడిపోయిన ఘటనలో తొమ్మిది మంది ప్రయాణికులు మరణించడం విషాదకరమని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సిపిఎం జిల్లా కమిటీ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిందన్నారు. ప్రమాదంలో గాయపడి, ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వారికి తక్షణమే తగిన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా శాశ్వత ప్రాతిపదికన ముందస్తు భద్రతా చర్యలను చేపట్టాలని కోరారు.. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గా ప్రసాద్, ఎన్ బలరాం తదితరులు ఉన్నారు .

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది

రామచంద్రపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం ఉదయం టూరిస్ట్ బస్సు లోయలో పడి పలువురు మృత్యువాత పడిన విషాద ఘటనపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. మతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

రోడ్ల అభివృద్ధికి రూ 20.63 కోట్ల మంజూరు

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి డిప్యూటీ సిఎం పవన కళ్యాణ్ ప్రత్యేకంగా రూ. 20.63 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ తెలిపారు నగరం తాడి వారి మెరకలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రూ.8 కోట్లు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలో 80 శాతం రోడ్లను ఆధునికీకరించామని అన్నారు. వచ్చే ఆరు నెలల్లో నియోజకవర్గంలో రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

రహ దారులను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దిన్, కూటమి నాయకులు జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు జాలెం అనూష తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం అందించాలని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ కోరారు. క్రిస్మస్, సంక్రాంతి వంటి పర్వదినాలు, పండగ శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు, బ్యానర్లపై ముద్రించే స్లోగన్‌లు ఎవరిని కించ పరిచే విధంగా ఉండరాదన్నారు. అంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలిసి ఉండాలన్నారు. జిల్లా పేరు విషయం లో కూడా ఏ విధమైన వివాదాలు ఏర్పడకుండా ప్రభుత్వం ప్రకటించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పై అంశాలపై పెద్దలు యువతకు అవగాహన కల్పించాలని, వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ జి భవాని, ఎస్ఐ ఎ.చైతన్యకుమార్, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

16 ,17 తేదీల్లో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఉపాధ్యాయ ఆటల పోటీలు ఈనెల 13, 14 తేదీలలో నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ నెల 16 , 17 తేదీల్లో ఈ పోటీలు జరుగుతాయని రామచంద్రపురం ఉపవిద్యాశాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ రామచంద్రపురం గవర్నమెంట్ హై స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహిస్తారన్నారు. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు ఇందులో పాల్గొంటారని ఆయన తెలియజేశారు. మారిన తేదీలను ఉపాధ్యాయులు గమనించాలని ఆయన సూచించారు.

భవన నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల స్టేటస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపిడిఒ హెచ్.భానోజీరావు, మండలంలో అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పిహెచ్‌సిల వైద్యాధికారులతో వీటిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణా నికి సంబంధించి స్థలాల కేటాయింపు, అనుమతి మంజూరు తదితర అంశాలపై చర్చించారు. సంబంధిత మినిట్స్‌ను రామచంద్రపురం ఆర్‌డిఒకు పంపించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ పి.రత్నకుమారి, డాక్టర్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ, డిఎస్‌పి కార్యాలయాలు కొనసాగించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురంలో ఉన్న ఆర్‌డిఒ, డిఎస్‌పి, నీటిపారుదల కార్యాలయాలను యథావిధిగా కొనసాగించాలి అఖిలపక్ష ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ నియోజ కవర్గ ప్రజల అభిప్రాయాలు, ప్రాంతీయ అవసరాలు , ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యాల యాలు ఇక్కడే కొనసాగడం అత్య వసరమన్నారు. పూర్వం నుంచి రామచంద్రపురం తాలూకా ప్రధాన కేంద్రంగా, ఈ ప్రాంతానికి సహజమైన పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. 12 సంవత్సరా లుగా ఆర్‌డిఒ కార్యాలయం ప్రజలకు అందిస్తున్న సేవలు, పరిపాలనా సౌలభ్యం, భూమి, రెవెన్యూ సమస్యల పరిష్కారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ కార్యాలయాలను తరలించడం ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులను కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యూ డెమోక్రసీ జిల్లా

మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సంతకాల సేకరణ

సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు వెంటపల్లి భీమశంకరం, బిజెపి స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ నలాది సతీష్ నాయుడు, సీనియర్ అడ్వకేట్ మల్లిడి హరినాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు వాసంశెట్ట శ్యామ్, పెట్ట శ్రీనివాసు, ఎంపిపి అంబటి భవాని, మున్సిపల్ ఛైర్మన్ గాధంశెట్టి శ్రీదేవి, మహిళా విభాగం నాయకులు ఎల్లమెల్లి సతీష్ కుమారి, పలు గ్రామా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంతకాలను సేకరించారు.

కాకినాడలో విలీనం చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలంటూ ఐదు నెలలుగా ఉద్యమం కొనసాగుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం న్యాయవాది మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో ద్రాక్షారామంలో ఆటో యూనియన్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోనసీమ వద్దు కాకినాడ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమ్మిరాజు మాట్లాడుతూ రామ చంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని రామచంద్రపురం మండలంలోని అన్ని పంచాయతీలు తీర్మానం చేశాయన్నారు. కె.గంగవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు తీర్మానించాయని అన్నారు. దీంతో పాటూ రామచంద్రపురం మున్సిపల్

ద్రాక్షారామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన

కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. అయితే రాజ్యాంగం వ్యవస్థలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతి మండల కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, ఆళ్ల బుజ్జి, కాసి సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ పొదుపు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండపేట

ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పై సోలార్ విద్యుత్ వ్యవస్థను అమర్చుకుని విద్యుత్ పొదుపు చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండపేట మునిసిపల్ కార్యాలయం పై అంతస్తులో ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. మున్సిపల్ సాధారణ నిధులు మొత్తం రూ.17లక్షలతో 30 కెవి సోలార్ విద్యుత్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ టివి.రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. తక్కువ ఖర్చుతో దీనిని ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవచ్చని బ్యాంక్ రుణం సబ్సిడీ తో మంజూరు చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ పొదుపు తో బాటు అధిక బిల్లులు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఈ


మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, విజయనగరం చెందిన సౌరా సోలార్ సొల్యూషన్ సంస్థ ప్రతినిధులు, డిఇ కింతాడ శ్రీనివాస్, ఎఇలు దాసరి పవన్, అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టిడిపి నాయకులు సిరంగు ఈశ్వరరావు, పాలచర్ల శిరీష్, శెట్టి రవి కుమార్, సిబ్బంది, ఉద్యోగులు, పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - మండపేట

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైసిపి తరపున అడ్డుకుంటామని మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్జి రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ ఛైర్మన్ ఎంఎల్సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గం సేకరించిన కోటి సంతకాలకు ప్రత్యేక వాహనం లో జిల్లా కేంద్రం అమలాపురానికి తరలించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైసిపి కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని మెడలు వంచి ఈ ప్రయి వేటీకరణను అడ్డుకునే వరకు అలుపెరగని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రం కు ఈ సంతకాలు పంపిస్తున్నామన్నారు. అనంతరం బైక్ ర్యాలీలో ఆయన

కోటి సంతకాల ర్యాలీలో మాట్లాడుతున్న ఎంఎల్సి తోట

పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండపేట పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, దూలం వెంకన్న బాబు, కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ, జెడ్‌పిటిసి కె.భవాని రాంబాబు, పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి, వైసిపి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల విచారణ త్వరిత గతిన పూర్తి చేయాలని చాలని జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి అధికా రులకు సూచించారు. దోషులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకుని బాధితులకు సత్వర న్యాయం అందిం చాలని ఆమె అధికా రులకు సూచించారు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు డిఆర్ఓ అధ్యక్షతన 4వ త్రైమాసిక ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్ట జిల్లా విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సమావేశం సభ్య లతో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసులను సత్వరంగా పరి ష్కరించే దిశగా అధి కారులు పనిచేయాలన్నారు. తొలుతగా జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి గత సమావేశ మినిట్స్ పై తీసుకున్న చర్యలను సభ్య లకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 43 కేసులు పెండింగ్లో ఉన్నాయన్నారు. వీటిలో 30 కేసులు ఎఫ్ఐఆర్ దశలోనూ, 12 కేసులు ఛార్జిషీటు దశలోను ఉన్నాయన్నారు. ఒక కేసు పోస్టుమార్టం దశలో ఉందన్నారు. వీటి నష్టపరి హారాలకు సంబంధించి రూ.35,50,000 బడ్జెట్ రిక్వైర్మెంట్ ఉందని తెలి పారు. కమిటీ సభ్యులు ప్రసంగిస్తూ వసతి గృహ లలో మౌలిక సదు పాయాలు వంటి కొరత ఉందన్నారు. బాలికల కు సంబంధించి మొబైల్ కు ఎడిట్ అవ్వ కుండా విద్యపై


సమావేశం మాట్లాడుతున్న ఆర్‌డిఒ మాధవి

దృష్టిని కేంద్రీకతం చేసేలా ఉపా ధ్యాయులు, సంక్షేమ అధికారులు కషి చేయా లన్నారు. అదేవిధంగా లైంగిక వేధింపులకు గురికాకుండా అవగాహన పెంపొందించా లని ముక్తకంఠంతో కోరారు దీనిపై డిఆర్ఓ స్పందించి మాట్లా డుతూ త్వరలో వసతి గృహ సంక్షేమ కార్యకలాపాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో విస్తత స్థాయి సమావేశం నిర్వహిస్తారన్నారు. ఎంఎల్సి కుడిపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ వసతి గృహాలలో తాగునీటి సమ స్యలను పరిష్కరించా లని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ప్రసాద్, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, డిఎస్‌పిలు, జిల్లాస్థాయి అధికారు లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుధీర్

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పౌరసరపరాల శాఖ ఛైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక రైతు సేవా కేంద్రం నందు శుక్రవారం రైతు సమావేశానికి సుధీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రైతులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తాము పండిస్తున్న ధాన్యం అమ్మకాలలో ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలను పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ క్రాప్ విధానం నమోదు అయిన రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు భరోసా లబ్ధిదారులకు మెసేజ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం గోదాములో బియ్యం, పామాయిల్ నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెవిఎల్‌కు 'వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయుడు జగత వెంకట లక్ష్మి నరసింహారావుకు ఢిల్లీకి చెందిన 'వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సుజాల్ కుమార్ యాదవ్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ విషయాన్ని నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానేలంక గ్రామానికి చెందిన జెవిఎల్ నరసింహారావు 25 సంవత్సరాలుగా ఆంగ్ల ఉపాధ్యాయు డిగా ఆంగ్ల భాష అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డు లో చోటు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఢిల్లీ కి చెందిన సంస్థ జెవిఎల్ కృషిని గుర్తించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

14న కె.గంగవరం మండల బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండల బడ్జెట్ సమావేశం ఈ నెల 14 ఆదివారం నిర్వహిస్తారని ఎంపిడిఒ ఎన్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి పంపన నాగమణి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు బడ్జెట్ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, శాశ్వత ఆహ్వానితులు హాజరుకావాలన్నారు.

కార్టూ'నిజం'



సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన అధికార యంత్రాంగంతో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధి 18 గ్రామాల నుంచి వివిధ సమస్యలపై లబ్ధిదారులు తరలివచ్చి 149 వినతులు అందజేశారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. అయితే కొన్నింటిని జిల్లాస్థాయి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. చెముడులంక ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన వద్ద జాతీయరహదారికి అధికారికంగా డివైడర్ ఏర్పాటు చేయాలని, బడుగువానిలంక గ్రామం వెళ్లేందుకు ఎన్‌హెచ్ నుంచి రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు, కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారుల దష్టికి తీసుకొని వెళ్లి ఏర్పాట అయ్యేలా కషి చేస్తానన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో డాక్టర్ల వ్యవహార శైలిపై

ఎంఎల్ఎ బండారుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

ఫిర్యాదులపై స్పందించిన ఆయన సంబంధిత డాక్టరుతో ప్రజలకు ఏ ఇబ్బంది తలెత్తకుండా సేవలు అందించాలన్నారు. నవాబుపేట పంట పొలాల ముంపునకు కారణం అవుతున్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని రైతులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని పంచాయతీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-రాజానగరం

లారీ ఢీ కొని పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన రాజానగరం జాతీయ రహదారి వైఎస్ఆర్ జంక్షన్లో శుక్రవారం జరిగింది. గ్రామ పంచాయతీలో విధులు నిమిత్తం టివిఎస్ మోటార్ సైకిల్పై చంద్రమళ్ల వీర్రాజు, కొత్తపల్లి శ్రీను వెళ్తున్నారు. వైఎస్ఆర్ జంక్షన్ సర్వీస్ రోడ్డ్ నుంచి జాతీయ రహదారి వైపునుకు మలుపు తిరుతుండగా రాజమహేంద్రవరం వైపుకు వెలుతున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రీనును లారీ ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన శ్రీనును 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలోనే శ్రీను(36) మృతి చెందాడు. శ్రీనుకు భార్య, ఏడాది వయసుగల కుమార్తె ఉన్నారు. ఎస్ఐ జివివి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

డ్రంకెన్ డ్రైవ్లో పోలీసులు పదిమందిపై కేసు నమోదు చేశారు. మండలంలోని ఆత్రేయపురం కాలువ రేవు, లొల్ల లాకులు, తదితర గ్రామాల ప్రముఖ కూడళ్లలో వాహనాల తనిఖీలు భాగంగా పోలీసులు రికార్డులను పరిశీలించారు, ఈ సందర్భంగా అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టుగా అనుమానిత వ్యక్తులను బ్రీతింగ్ ఎనలైజర్ యంత్రాలతో పరీక్షించారు. పరీక్షించగా పరిమితికి మించి మద్యం తాగినట్లు తేలడంతో ఈనెల ఒకటవ తేదీ నుంచి ఈ నెల12వ తేదీ సాయంత్రం వరకు 10 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ ఎస్.రాము శుక్రవారం తెలిపారు. వీరిని కొత్తపేట జెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన అల్లం రమేష్ (32) రాజవరంలోని మామిడి తోటలో గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రమేష్కు రావికవితం మండలం గొంప గ్రామానికి చెందిన రమణమ్మతో వివాహం అయింది. భార్యాభర్తల మధ్య రెండేళ్లుగా వివాదం నెలకొందని, ఈ కారణంగానే రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు

బైకుల చోరీపై ఏడుగురు అరెస్టు
29 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో వరుస బైకుల దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రూ.14.50 లక్షల విలువైన 29 బైకులను స్వాధీనం చేసినట్లు ఎస్పి జి.బిందు మాధవ్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బైకుల చోరీ నేపథ్యంలో పోలీస్ బృందాలు సంయుక్తంగా దర్యాప్తు కొనసాగించాయన్నారు. ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం 29 బైకులు దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారన్నారు. యేగి విజయ్, నీలపు హర్ష సాయి వర్ధన్, చెర్ల జగన్మోహన్ రెడ్డి, సలాది బిర్లా, మేడిద సూర్యప్రకాశరావు, అడబాల శ్రీను, సలాది శ్రీనివాస్ను అరెస్టు చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను ఎస్పి అభినందించారు.

హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సినిమా రోడ్డులోని ఎస్ఆర్కె సెంటర్లో ఈ నెల 9న జరిగిన హత్య కేసులో నిందితుని అరెస్ట్ చేసినట్లు 3వ పట్టణ సిఐ కెవిఎస్.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే కీర్తి సత్యనారాయణ(45)ను మార్కెట్ ఏరియాకు చెందిన అత్తిలి రంగ మద్యం సేవించి వచ్చి చెప్పులు కుట్టే చోట ఉండే పదునైన చాకుతో బలంగా పొడిచి పరారయ్యాడు. సత్యనారాయణను జిజిహెచ్కు తరలించడగా అక్కడ మృతి చెందాడు. సత్యనారాయణ ముందు రోజు అసభ్యంగా తిట్టాడని అతనితో ఘర్షణకు దిగి రంగ చాకుతో పొడిచి చంపినట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం పోలేకుర్రులో రొయ్యల చెరువు వద్ద ఉన్న భవనం మొదటి అంతస్తులో ఒక యువకుడు ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ. సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు యానాంకు చెందిన సత్యవరపు సూర్యనారాయణమూర్తి రొయ్యల చెరువు వద్ద నాలుగేళ్లుగా ఛత్తీస్ఘడ్కు చెందిన పడాల శివశంకర్ (24) కూలి పని చేస్తున్నాడు. శివ శంకర్ ప్రేమ విఫలమైనందున మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిఎచ్కు తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం శివారు కోటేరు పుంత రోడ్డులో శుక్రవారం సాయంత్రం పేకాడుతున్నారన్న సమాచారం రావడంతో ఎస్ఐ ఎస్ రాము తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 8 మందిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జవహర్ నవోదయ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలలో 3046 విద్యార్థిని, విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు అర్ధగంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాల్సి ఉందని జిల్లా కామన్ ఎగ్జామి నేషన్ బోర్డు సెక్రటరీ హనుమంత రావు సూచించారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

రక్షణ చట్టాలపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులోని శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయంలో బాలికలకు రక్షణ చట్టాలపై కొవ్వూరు శక్తి టీం సభ్యులు శుక్రవారం అవగాహన కల్పించారు. శక్తి యాప్, 112 ఎమర్జెన్సీ సేవలు, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, సైబర్ మోసాలు నివారణ,ా ఎల్ఫ్ డిఫెన్స్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి టీం సభ్యులు ఎఎస్ఐ గంగాధర్రావు, మహిళా పోలీసులు ఎం.పద్మావతి పలు విషయాలపై విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో చాగల్లు, నేలటూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయ కన్వీనర్ వివి.రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం-రంప ఎర్రం పాలెం రోడ్డులో ఎర్రంపాలెం సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. తీగలకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఏ క్షణాన్నైనా విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై వెళ్లే వాహనదారులపై పడే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రంప ఎర్రంపాలెం గ్రామ ప్రజలు కోరు తున్నారు.

జిఎఫ్ఎల్ఎన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్యారంటీ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి (జిఎఫ్ఎల్ఎన్) డైరీలను మండల ఉపాధ్యాయులంతా వినియోగించుకుకోవాలని విద్యాశాఖాధికారి సిహెచ్.సత్కేనారాజు కోరారు. ఎస్టియు ప్రచురించిన ఈ డైరీలను ఎంఇఒ ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రారంభమైన 75 రోజుల జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై డైరీ తయారు చేయడం అభినందనీయమన్నారు.

కొవ్వూరులో ఎంఎల్ఎ ప్రజాదర్బార్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రజా దర్బార్ను నిర్వహించారు. నియోజవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఎస్సి కమ్యూనిటీ హల్, డ్రెయినేజీ నిర్మించాలని, పెనకనమెట్ట కొత్త కాలనీలో హ్యాండ్ పంపు ఏర్పాటు చేయాలని వినతులు అందించారు. తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని పలువురు వినతి పత్రాలు అందజేశారు .కొవ్వూరులో రజకుల విశ్రాంతి భవనానికి మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాలను అందించారు. టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సిద్ధా దుర్గాప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

ఆర్టిసి బస్సులకు ఫస్ట్ ఎయిడ్ బాక్సుల వితరణ

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం ఆర్టిసి డిపోలో ఉన్న బస్సులకు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్లు, అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించారు. డిపోలో పనిచేసే వారందరికీ ఐడి కార్డ్ ద్వారా ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 50శాతం రాయితీపై రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది, డిపిటిఒ వైఎస్ఎన్.మూర్తి, డిపో మేనేజర్ మార్గరేట్ సుచరిత, ఎఎంఎఫ్ రాజు, ఎస్టిఐ అప్పారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- గోపాలపురం

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని రిటైర్డ్ ఉద్యాన శాఖ శాస్త్రవేత్త ఇ.విజయప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్యాల అగ్రికల్చర్ కార్యాలయంలో ఐటిసి, ఎంఎస్కె సహకారంతో గ్రామ సిరి ఎన్జిఒ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. ఎఒ కె.ఏసుబాబు, మండల హార్టికల్చర్ అధికారి జి.రమేష్, చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు గద్దే హరిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వమించారు. వారు మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. పొగాకు నుంచి ఉద్యాన పంటలు సాగు చేయాలని అన్నారు. ఆర్గానిక్, సేంద్రియ ఎరువులనే వాడాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు గద్దె హరిబాబు, టిడిపి సీనియర్ నాయకులు నందిన సుబ్రహ్మణ్యం, రైతుల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి -గోపాలపురం

డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ ఎన్.పార్వతి సూచించారు. గోపాలపురం రామాలయం వద్ద నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గోపాలపురం పరిసర ప్రాంతాలు, ఎగువలో ఉన్న కోమటికుంట పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు వస్తుందన్నారు. ఈ నీటికి తగ్గట్టుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైకి నీరు చేరుతుందన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. దీనిపై ప్రజలు ఇబ్బందులు పడడంతో రూ.10లక్షల నిధులతో 62 మీటర్లు పొడవు 1.2 మీటర్లు ఎత్తు, రెండు మీటర్లు వెడల్పుతో డ్రెయినేజీని నిర్మిస్తున్నామన్నారు. ఆమె వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్ కోటి పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోటనందూరు

సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. నూకరత్నం అధ్యక్షతన శుక్రవారం తుని పట్టణ రిసోర్స్ పర్సన్ సమావేశం నిర్వహించారు.కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు తుని మండల కార్యదర్శి నక్కెళ్ళ శ్రీనివాస్, కామేశ్వరి, రమణ పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొద్ది రోజుల నుంచి చలి తీవ్రత పెరుగుతోంది. ఇక రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. 17 నుంచి 20 డిగ్రీల మధ్యన రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు అవస్థ పడుతున్నారు. ప్రస్తుతం వరి చేలకు సాగునీరు మళ్లించడంతో పల్లెల్లో పొగ మంచు చలి తీవ్రత అధికమైంది. చలి మంటలు వేసుకుంటూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు. చలి తీవ్రత నేపథ్యంలో తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. తలకు మంకీ క్యాప్లు ధరించడం, స్వెటర్లు వేసుకోవడం వంటివి చేయాలన్నారు. రాత్రి సమయంలో ప్రయాణాలు తగ్గించుకోవాలన్నారు. గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల కొంత ఉపయోగం ఉంటుందన్నారు. తెల్లవారుజామున పొగ మంచు తగ్గేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

డీలర్లు పారదర్శకంగా సేవలు అందించాలి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు రేషన్, ఎల్పిజి గ్యాస్ డీలర్లతో జిల్లా స్థాయిలో జెసి టి.నిశాంతి శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీలర్లు లబ్ధిదారులకు పారదర్శకంగా సేవలు అందించాలనా జెసి సూచించారు. గ్యాస్ డీలర్లు సత్ప్రవర్తన కలిగిన డెలివరీ బాయ్లను నియ మించుకోవాలన్నారు. అదనపు సొమ్ములు లబ్ధిదారుల నుండి వసూలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెలివరీ బాయ్లకు ప్రవర్తన పట్ల కౌన్సిలింగ్ చేసినప్పటికీ పరిస్థితి మారకపోతే డెలివరీ బాయ్ స్థానంలో వేరొక వ్యక్తిని నియమించుకోవాలని డీలర్లు సూచించారు. జిల్లా పౌరస రఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్ ప్రసంగిస్తూ గ్యాస్ సిలిండర్ బుకింగ్, డెలివరీ వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. మీటర్తో తూకం వేయడం సిలిండర్ సీల్ సరిగా ఉందో లేదో లబ్ధిదారుల ఎదుటే చూపాలన్నారు. అదనపు రవాణా సర్వీస్ ఛార్జీలు విధించడం నిషేధమన్నారు. ప్రతి నెలా రేషన్ స్టాక్ వివరాలను బహిరంగ ప్రదర్శన బోర్డులో చూపాలనీ. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ నవీకరించి చూపగలగాలన్నారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, టోల్ ఫ్రీ నంబర్లు, హెల్ప్లైన్, మొబైల్ యాప్స్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి వేగంగా పరిష్కరించాలన్నారు. డీలర్ల పై వచ్చిన ఫిర్యాదుల ను సమయానికి విచారించి చర్యలు తీసుకో వడంతో ప్రజా నమ్మకాన్ని పెంచుతుందన్నారు. రేషన్ దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలు తప్పనిసరన్నారు. ప్రజా సంతప్తి స్థాయిలను ఎప్పటికప్పుడు విశ్లేషించి జిల్లాకు రేషన్, ఎల్పిజి గ్యాస్ పంపిణీలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకుని రావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రభుత్వపరంగా చురుగ్గా సాగుతోందని కొనుగోలు చేసిన వెంటనే ఎఫ్టిఒ జనరేట్ చేసి 24 గంటల్లోపు నిధులు రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు బాబి, త్రినాథ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతితో పాటు నిధులు మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ శనక్కాయల రాజకుమారి శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయం లో సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్టుకు పరిపాలన ఆమోదంతో, పాటు నిధులు మంజూరైతే పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నం లంక, బి. దొడ్డవరం గ్రామాలలో సుమారు 4,500 ఎకరాల సారవంతమైన భూములకు సాగునీరు లభ్యమవుతుందన్నారు. తమ పూర్వీకులకు చెందిన పెదపట్నం లంకలో భూములతో పాటు సమీప గ్రామాలలో సారవంతమైన భూముల సాగునీటి సమస్యను రైతులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. సాగునీరు లభ్యమైతే అంతర పంటల సేద్యంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. సిఎం సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

పాఠశాలకు క్రీడా పరికరాల వితరణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మాచర ఉన్నత పాఠశాలకు శుక్రవారం వాలీబాల్, నెట్ను దాతలు అందించారు. మాచర గ్రామానికి చెందిన అడపా సత్తిబాబు విద్యార్థులను క్రీడా ప్రోత్సహకంగా సుమారు రూ.5 వేల విలువ గల వీటిని విఆర్ఒ ప్రసాద్ ప్రోత్సాహంతో అందజేశారు. ఈ సందర్భంగా వీరిని పాఠశాల హెచ్ఎం, ఎంఇఒ-2 విజయ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో విఆర్ఒ ప్రసాద్, వ్యాయామో పాధ్యాయురాలు నాగూర్ బీబీ, ఉపాధ్యాయులు జిఎస్ఆర్. ప్రసాద్, బాలు, వీరబాబు, రామారావు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

సలాది దంపతులను సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం బోర్డు డైరెక్టర్గా సలాది నాగేశ్వరరావు నియమితులయ్యారు. పెదపళ్లకు చెందిన సలాది నాగేశ్వరరావు దంపతులకు వారి నివాసంలో శుక్రవారం సందిపూడి గ్రామ సర్పంచ్ తోట భవాని, వెంకటేశ్వర్లు దంపతులు మొక్కను అందజేశారు. అనంతరం సలాది నాగేశ్వరరావు దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోట భవాని మాట్లాడుతూ సలాది నాగేశ్వరరావు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారంలోనూ, సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారన్నారు. ఆయనకున్న అంకితభావం, శ్రద్ధను ప్రభుత్వం గుర్తించి ఈ పదవిని కట్టబెట్టిందన్నారు. ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రాష్ట్రస్థాయి అండర్ -14 సాఫ్ట్ బాల్ పోటీలకు గొల్లవిల్లి జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన మల్లిపూడి అయ్యప్ప, సవరపు లక్ష్మి ఈనెల 13, 14 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాలలో హెచ్ఎం జి.కనకదుర్గ, పీడీలు గొలకోటి ఫణీంద్రకుమార్, దూలం సరస్వతి, టి.సునీత, వి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా హరినాథరావు పుట్టిన రోజు

ప్రజాశక్తి - రావులపాలెం

, రావులపాడులో శుక్రవారం రాష్ట్ర వైసిపి వాణిజ్య విభాగం కార్యదర్శి కాళ్లకూరి హరినాథరావు పుట్టినరోజు వేడుకలు పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆపదలో అండగా నిలిచే ఆయన సేవాకార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం హరినాథరావు ఊబలంక మదర్ థెరిసా హోమ్లో వికలాంగులకు, వృద్ధులకు భోజనం, పండ్లు పాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి నాగిరెడ్డి, మాజీ జెడ్పి ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్, మన్యం పర్వత వర్ధనరావు, మన్యం భాను, సమయమంతుల చినబాబు, సర్పంచ్ మట్టా బాబ్జీ , అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు మండలం పసివేదలలో శుక్రవారం కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరాన్ని ఆంధ్ర సుగర్స్ జెఎండి పెండ్యాల అచ్చిబాబు, ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. హైదరాబాద్ బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వైద్యులు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ది రంగరాయ విశాఖ సహకార సంఘం బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరానికి వందలాది మంది మహిళలు హాజరై స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ గారపాటి రామచంద్రరావు, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ అబ్దుల్, డాక్టర్ మాన్విత, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కౌశల్ విజేతలకు బహుమతుల అందజేసిన డిఇఒ నాగేశ్వరరావు

క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు చదువుతో పాటూ క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని డిఇఒ పి.నాగేశ్వరరావు అన్నారు. ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియం హాలు నందు శుక్రవారం డిసిఇబి సెక్రటరీ బి.హనుమంత రావు అధ్యక్షతన జిల్లా స్థాయి కౌశల్ విజేతల బహుమతులను ప్రదానం చేశారు. డిఇఒ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం, జిల్లా కో-ఆర్డినేటర్ ఎం ఎన్.సూర్యనారాయణ, జాయింట్ కో-ఆర్డినేటర్ ఎస్.బాబులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం నగరం సర్ సివి.రామన్ స్కూల్లో రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భం గా ముఖ్య అతిథిగా ఎంఎల్సి కుడుపూడి సూర్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలన్నారు. ఆత్మీయ అతిథి జిల్లా విద్యాశాఖ అధికారి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సరదాలు మానుకొని, జీవితం అంటే ఏంటో తెలుసుకుని ముందుకు సాగాలని డ్రగ్స్కు దూరంగా ఉండాలని అన్నారు. అతిథులు అడిషనల్ డిఎంహెచ్ఒ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. .సర్ సివి రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, మెడికల్ ఆసిస్టెంట్ శీను బాబు, ఆర్ఎస్యు స్టేట్ జాయింట్ సెక్రటరీ నరేంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కళాశాల ఎఒ, సేవా రత్నకరాటం ప్రవీణ్, డిఇఒ జి.సూర్యప్రకాశం, సైకాలజిస్ట్ సాంబశివరావు, వెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులు వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని ఆయన తెలిపారు. వారోత్సవాల నిర్వహణ కోసం సన్నాహక సమావేశం ఈ సందర్భంగా జరిగే రాష్ట్రస్థాయి పోటీలకి విద్యార్థులు తయారు కావలసిన విధానం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమలాపురం జెడ్పి హైస్కూల్ నందు నిర్వహించిన అవగాహనా సదస్సుకి ఆయన అధ్యక్షత వహించారు. అధికారులను విద్యార్థులను చైతన్యపంతం చేశారు. వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని వినియోగ దారులతో సంబంధం ఉన్న అన్ని శాఖల వారు ఇందులో పాలుపంచుకోవాలని ఆయన కోరారు. సర్వ శిక్ష అభియాన్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ మమ్మీ, జిల్లా మార్కెటింగ్ అధికారి విశాలాక్షి, అదనపు డిఎంహెచ్ఒ జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, సిఎమ్ఒ మొదలైన అధికారులందరూ తమ తమ శాఖలు వినియోగదారుల రక్షణకు తీసుకునే చర్యలు వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి హైస్కూలు, జూనియర్ కాలేజ్ విద్యార్థులకు వినియోగదారుల రక్షణపై వక్తృత్వ వ్యాసరచన పోటీలు ఉం